

ఏటూరునాగారం: సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ కవిత, చిత్రంలో ఎమ్మెల్సీ సత్యవతి తదితరులు




# రిజిస్ట్రేషన్ల శాఖకు కాసుల పంట

**వ్యవసాయేతర రెవెన్యూ రూ.415.64 కోట్లు**

**ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మొత్తం 1,06,106 డాక్యుమెంట్లు**

**అత్యధికంగా వరంగల్ ఆర్వోలో, అత్యల్పంగా వర్ధన్నపేటలో..**

**గతేడాది కంటే రూ.11.21 కోట్లు అధిక ఆదాయం**

హనుమకొండ, ఏప్రిల్ 11 : ప్రభుత్వానికి ఆదాయం సమకూర్చే శాఖల్లో ముఖ్యమైన రిజిస్ట్రేషన్ల శాఖకు కాసుల పంట పండింది. డాక్యుమెంటేషన్ రిజిస్ట్రేషన్ల సంఖ్య పెరగడంతో ఆదాయం కూడా పెరిగింది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మొత్తం 1,06,106 డాక్యుమెంట్లకు రూ.415.64 కోట్ల ఆదాయం వచ్చింది. మొత్తం మీద గతేడాది కంటే రూ.11.21 కోట్లు ఎక్కువగా వచ్చింది. 2023-24 ఆర్థిక సంవత్సరంలో మార్చి నెలాఖరు వరకు వ్యవసాయేతర భూముల క్రయవిక్రయాల్లో అత్యధికంగా వరంగల్ ఆర్వో కార్యాలయానికి 29,557 డాక్యుమెంట్ల ద్వారా రూ. 201.22 కోట్లు, అత్యల్పంగా వర్ధన్నపేట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి 1,594 డాక్యుమెంట్ల ద్వారా రూ.2.80 కోట్ల ఆదాయం వచ్చింది. వరంగల్, హనుమకొండ, కాజీపేట నగరం చుట్టూ రియల్ ఎస్టేట్ రంగంతో పాటు వెంచర్లు పెరగడం, కొత్తగా జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో సబ్‌రిజిస్ట్రార్ ఆఫీసును ప్రారంభించడంతో ఆదాయం పెరిగిందని ఆ శాఖ అధికారులు తెలిపారు.

**సబ్ రిజిస్ట్రార్ ఆఫీసుల వారీగా ఆదాయ వివరాలు**

| సబ్ రిజిస్ట్రార్ | డాక్యుమెంట్లు | ఆదాయం(లక్షల్లో) |
|---|---|---|
| భీమదేవరపల్లి | 5158 | 1335.99 |
| స్టేషన్ ఘన్‌పూర్ | 6059 | 1354.31 |
| జనగామ | 12751 | 2575.33 |
| కొడకండ్ల | 1619 | 261.88 |
| మహబూబాబాద్ | 15893 | 3651.71 |
| ములుగు | 5167 | 1090.4 |
| నర్సంపేట | 6261 | 1178.53 |
| పరకాల | 2963 | 838.72 |
| వర్ధన్నపేట | 1594 | 280.02 |
| వరంగల్ రూరల్ | 4174 | 3047.11 |
| వరంగల్ ఆర్వో | 29557 | 20122.18 |
| వరంగల్ ఫోర్టు | 10626 | 4941.61 |
| భూపాలపల్లి | 4194 | 885.83 |
| మొత్తం | 106016 | 41563.61 |

**గతం కంటే రూ.11.21 కోట్లు అధికం**

వరంగల్, హనుమకొండ ప్రాంతాల్లో అపార్ట్‌మెంట్, విల్లాస్ కల్చర్‌తో పాటు ఇండిపెండెంట్ ఇళ్లు, కాంప్లెక్స్ నిర్మాణాల సంఖ్య పెరిగింది. ముఖ్యంగా ప్రభుత్వ, ప్రైవేట్ బ్యాంకులు తక్కువ వడ్డీలతో హౌసింగ్ రుణాలు అందిస్తుండడంతో మధ్య తరగతి వర్గాల సొంతింటి కల నెరవేరుతున్న సమయంలో నిర్మాణ రంగం సైతం ఊపందుకుంది. ఈ నేపథ్యంలో రిజిస్ట్రేషన్ డాక్యు మెంట్ల సంఖ్య పెరిగి ఆదాయం కూడా పెరిగిందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

# 420 కాంగ్రెస్‌ను ఎండగట్టాలి

**ప్రభుత్వం వచ్చి 120 రోజులైనా ఏ ఒక్క హామీ అమలు కాలె..**

- రుణమాఫీ, మహాలక్ష్మి పథకాలేమయ్యాయి?
- కాంగ్రెస్ రాగానే మొదలైన కరెంటు కష్టాలు
- పంటలు ఎండి ఇప్పటికే 200 మంది రైతుల ఆత్మహత్య
- పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు గుణపాఠం చెప్పాలె..
- బీఆర్ఎస్ మహబూబాబాద్ ఎంపీ అభ్యర్థి, ఎంపీ మాలోత్ కవిత
- కల్యాణలక్ష్మి ద్వారా తులం బంగారం ఏమైంది..?
- గ్రామాల్లో కాంగ్రెస్ నాయకులను నిలదీయాలి
- మాజీ మంత్రి, ఎమ్మెల్సీ సత్యవతి
- ఏటూరునాగారంలో మహబూబాబాద్ పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సమావేశం

ఏటూరునాగారం, ఏప్రిల్ 11 : అసెంబ్లీ ఎన్నికల ముందు హామీ ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని బీఆర్ఎస్ మహబూబాబాద్ పార్లమెంట్ అభ్యర్థి, ఎంపీ మాలోత్ కవిత అన్నారు. అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చిన ఆ పార్టీని ప్రజల్లో ఎండగట్టాలని పిలుపునిచ్చారు. గురువారం ఏటూరునాగారంలోని బీఆర్ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన మహబూబాబాద్ పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ఎన్నికల సమయంలో 420 హామీలిచ్చి, వంద రోజుల్లోనే నెరవేర్చుతామని అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ, 120 రోజులైనా ఏ ఒక్క పథకాన్ని సరిగ్గా అమలు చేయలేదన్నారు. కేసీఆర్ ప్రభుత్వంలో 24 గంటల నాణ్యమైన ఉచిత కరెంటుతోపాటు పుష్కలంగా సాగు నీళ్లు ఉండడంతో ఎక్కడా ఎకరం పంట కూడా ఎండిపోలేదని, ఒక్క రైతు కూడా చనిపోలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మూడు నెలల్లో 200 మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారని, రైతుబంధు అందక చాలా మంది అప్పుల పాలయ్యారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత రైతు ఆత్మహత్యలు పెరిగిపోయాయన్నారు. కేసీఆర్ ప్రభుత్వంలో రైతు చనిపోయిన 10 రోజుల్లో ఆ కుటుంబానికి రైతుబీమా కింద రూ.5 లక్షలు అందేవని, కాంగ్రెస్ ప్రభుత్వం బీమా సొమ్ము చెల్లించకపోవడంతో 200 రైతు కుటుంబాలు రోడ్డున పడ్డాయని ధ్వజమెత్తారు. ప్రభుత్వం ఉన్నా లేకున్నా కేసీఆర్ వెంటే ఉంటామన్నారు. ప్రాణం పోయినా పార్టీ కండువా వదిలేది లేదన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ముందుగా గెలిచే సీటు మహబూబాబాద్ స్థానమేనన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో తొందరపడి కాంగ్రెస్‌కు ఓటేశామని గ్రామాల్లో అనుకుంటున్నారని, ఇప్పుడు ఆ పరిస్థితి లేదన్నారు. రైతులకు రూ.2లక్షల రుణమాఫీ, రైతుబంధు పెంపు, మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు రూ.2500 ఇస్తామన్నారు.. ఇప్పటివరకు ఎందుకు చేయలేదని నిలదీశారు. ప్రజలను మభ్యపెట్టి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీకి పార్లమెంట్ ఎన్నికల్లో గుణపాఠం చెప్పాలన్నారు. కార్యకర్తలు, నాయకులకు పార్టీ అండగా ఉంటుందని, మనో ధైర్యంతో ఉండాలని కోరారు. ములుగు జిల్లాకు మెడికల్ కళాశాల, ఏరియా వైద్యశాలను ఇవ్వడంతో పాటు జిల్లా కేంద్రంగా ప్రకటించిన ఘనత బీఆర్ఎస్‌దేనన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన అబద్ధపు హామీలను ప్రజల్లోకి తీసుకెళ్లి ఓట్లు అడగాలన్నారు.



సమావేశంలో పాల్గొన్న నాయకులు, కార్యకర్తలు

**డిక్లరేషన్ల పేరుతో కాంగ్రెస్ మోసం : మాజీ మంత్రి, ఎమ్మెల్సీ సత్యవతిరాథోడ్**

మాజీ మంత్రి, ఎమ్మెల్సీ సత్యవతిరాథోడ్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను నిలబెట్టుకోలేదని, డిక్లరేషన్ల పేరుతో రాష్ట్ర ప్రజలను మోసం చేసిందన్నారు. ఇచ్చిన హామీలపై గ్రామాల్లో కాంగ్రెస్ నాయకులు నిలదీయాలన్నారు. కల్యాణలక్ష్మికి అదనంగా ఇస్తామన్న తులం బంగారం ఏమైందని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏం చేయాలన్నా ఢిల్లీకి కప్పం కట్టాల్సిన పరిస్థితి ఉందన్నారు. కాంగ్రెస్ నాయకులు అధికారాన్ని చెలాయిస్తున్నారని, రెండు రోజుల క్రితం ఆ పార్టీ నాయకుడు ములుగు ఏరియా వైద్యశాల సూపరింటెంటెంట్‌ను బూతులు తిట్టాడని, ఆ వైద్యుడు కరోనా సమయంలో అనేక సేవలు అందించారని అన్నారు. ఏటూరునాగారానికి వరదలొస్తే స్వయంగా ఇక్కడికి ముఖ్యమంత్రి వచ్చి గోదావరి కరకట్టకు నిధులు మంజూరు చేశారని వివరించారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మీనర్సింహారావు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ఇచ్చిన హామీల్లో ఏ ఒక్కటీ నెరవేరలేదన్నారు. ప్రజల పక్షాన పోరాటం చేయాల్సిన అవసరముందని పిలుపునిచ్చారు. అందరం కలిసికట్టుగా పనిచేసి బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించుకుందామని పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ నాయకులు కూనూరు మహేశ్, సప్పిడి రాంనర్సయ్య కార్యకర్తల మనోవేదనను వివరించారు. పార్టీ అండగా ఉండాలని కోరారు. ఈ సమావేశంలో జడ్పీ చైర్‌పర్సన్ బడే నాగజ్యోతి, ఎంపీపీ అంతటి విజయ, జడ్పీ కో ఆప్షన్ సభ్యురాలు వలియాబీ, మండల అధ్యక్షుడు గడదా సునీల్‌కుమార్, నాయకులు గోవిందనాయక్, తుమ్మ మల్లారెడ్డి, సంజీవరెడ్డి, ఈసం రామ్మూర్తి, తాటి కృష్ణ, పీఏసీఎస్ చైర్మన్ కూనూరు అశోక్, దుర్గం రమణయ్య, మాదిరి రామయ్య, కాకుల మర్రి ప్రదీప్‌రావు, ఎజాజ్, కాళ్ల రామ కృష్ణ, తూరం పద్మ, ఈసం రామ్మూర్తి, అల్లి శ్రీనివాస్, చంద్రబాబు, కోటేశ్వర్‌రావు, పూజరి సురేశ్, ఎమ్డీ సలీం పాషా, ఖాజాపాషా, తాడూరి రఘు, మెరుగు వెంకటేశ్వర్లు, కాకా వెంకటేశ్వర్లు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న అరూరి రమేశ్

# గుంటూరు కోడలు కావాలా ఓరుగల్లు బిడ్డ కావాలా!

**కావ్య నజీరుద్దీన్‌కు ఎందుకు ఓటెయ్యాలి**

**కడియం శ్రీహరి దళితద్రోహి**

**బీజేపీ వరంగల్ పార్లమెంట్ అభ్యర్థి అరూరి**

వరంగల్, ఏప్రిల్ 11 : గుంటూరుకు చెందిన నజీరుద్దీన్‌ను పెళ్లి చేసుకున్న గుంటూరు వాస్తవ్యురాలైన కావ్య-నజీరుద్దీన్‌కు వరంగల్ ప్రజలు ఎందుకు ఓటెయ్యాలని వరంగల్ బీజేపీ పార్లమెంట్ అభ్యర్థి అరూరి రమేశ్ ప్రశ్నించారు. గురువారం హనుమకొండలో బీజేపీ మహబూబాబాద్ పార్లమెంట్ అభ్యర్థి అజ్మీరా సీతారాం నాయక్‌తో కలిసి ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వరంగల్ జిల్లా బిడ్డగా రెండు సార్లు ఎమ్మెల్యేగా గెలిచి వర్ధన్నపేట ప్రజలకు తోడున్నానన్నారు. గుంటూరు కోడలు కావాలా? వరంగల్ బిడ్డ కావాలో ప్రజలు ఆలోచించాలని కోరారు. కడియం శ్రీహరి కుట్రకు తాను బలయ్యాయని, మూడోసారి గెలిస్తే మంత్రి రేసులో ఉంటాననే అనుమానంతో తన ఓటమికి కుట్ర చేశాడని అరూరి మండిపడ్డారు. ఎస్సీ రిజర్వేషన్ ఫలాలను మాల, మాదిగలకు అందకుండా చేశారని విమర్శించారు. బీఆర్ఎస్‌లో ఉండి ఎస్సీ నేతలను బయటకు పంపించే వరకు కుతంత్రాలు చేశారన్నారు. చివరికి పార్టీని మోసం చేసిన వ్యక్తి కడియం శ్రీహరి అని మండిపడ్డారు. టీడీపీ, బీఆర్ఎస్‌లో దళితుడి పేరిట పదవులు పొంది చివరికి దళితులకు అన్యాయం చేశారన్నారు. ఏ పార్టీలో ఉన్నా కడియం శ్రీహరి దళితులను ఎదగకుండా అణచివేశారని ఆరోపించారు. మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్‌ను పార్లమెంట్ ఎన్నికల్లో ఓడించాలని ప్రజలకు పిలుపునిచ్చారు.


**కరువు తెచ్చిన కాంగ్రెస్ : అజ్మీరా సీతారాం నాయక్**

కాంగ్రెస్ పార్టీ కావాలనే కరువు తెచ్చిందని బీజేపీ మహబూబాబాద్ అభ్యర్థి అజ్మీరా సీతారాం నాయక్ అన్నారు. కాళేశ్వరం పిల్లర్ కుంగిన అంశాన్ని బూచిగా చూపి కాంగ్రెస్ ప్రభుత్వం పంటలను ఎండబెట్టిందని విమర్శించారు. ఇప్పటి వరకు కాంగ్రెస్ ప్రభుత్వం కరువు మండలాలను ప్రకటించక పోవడం రైతులపై ఉన్న ప్రేమ అర్థం అవుతోందన్నారు. వరంగల్ పార్లమెంట్ ఇన్‌చార్జి మురళీధర్‌గౌడ్, క్రమశిక్షణ కమిటీ కన్వీనర్ మార్తినేని ధర్మారావు, మాజీ ఎంపీలు గరికపాటి మోహన్‌రావు, చాడ సురేశ్ రెడ్డి, వరంగల్, హనుమకొండ జిల్లాల అధ్యక్షులు గంటా రవికుమార్, రావు పద్మ పాల్గొన్నారు.

# కాంగ్రెస్ నాయకులు నా భూమిని కబ్జా చేశారు..

**మంత్రి కొండా సురేఖకు బాధితుడి ఫిర్యాదు**

కరీమాబాద్, ఏప్రిల్ 11: తన భూమిని కొందరు కాంగ్రెస్ నాయకులు కబ్జా చేసి అక్రమ నిర్మాణం చేపడుతున్నారని, పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని బాధితుడు ఇక్బాల్ గురువారం రాష్ట్ర అటవీ, దేవాదాయ, పర్యాటక శాఖ మంత్రి కొండా సురేఖకు వినతిపత్రం అందజేశారు. గురువారం వరంగల్ ఫోర్ట్ రోడ్‌లోని ఈద్గాలో నిర్వహించిన రంజాన్ వేడుకల్లో మంత్రి పాల్గొన్నారు. ఈ క్రమంలో చింతల్‌లోని సర్వే నంబర్ 444లో గల 275 గజాల స్థలం కబ్జా చేశారని, తనకు న్యాయం చేయాలని ఇక్బాల్ కోరాడు. విచారణ చేసి కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలని మంత్రి కొండా సురేఖ పోలీసులను ఆదేశించారు.



ఎండిపోయిన మక్కజొన్న పంట

# చివరి తడికి నీళ్లివ్వరూ..

**చుక్కనీరు లేని ఎస్సారెస్పీ డీబీఎం-31 కాల్వ**

**నీరందించాలని కౌలు రైతుల విన్నపం**

**కౌలుకు తీసుకుని లక్షలు పెట్టుబడి పెట్టి నష్టపోయామంటూ ఆవేదన**

శాయంపేట, ఏప్రిల్ 11: చివరి తడికి నీళ్లు అందిస్తే పంటలు పండుతాయని, వెంటనే అధికారులు ఎస్సారెస్పీ కాల్వ ద్వారా నీళ్లు ఇవ్వాలని రైతులు వేడుకుంటున్నారు. శాయంపేటలోని ఎస్సారెస్పీ డీబీఎం -31 కాల్వ వద్ద నీళ్లు లేక పంటలు ఎండిపోతున్నాయని గురువారం కౌలు రైతులు నూకంటి మురళి, బెరుగు సతీశ్, నీల రవీందర్, కుమారస్వామి తదితరులు తమ గోడును వెల్లబోసుకున్నారు. ఏప్రిల్ వరకు ఎస్సారెస్పీ నీళ్లు ఇస్తామని చెప్పడంతో తాము ఎన్నో ఆశలతో మక్కజొన్న, వరి పంటను సాగు చేసినట్లు తెలిపారు. అయితే డీబీఎం- 31 ప్రధాన కాల్వతో పాటు ఉపకాల్వలకు చివరి ఆయకట్టుకు నీళ్లు అందలేదని చెప్పారు. పంటలు వేసినప్పటి నుంచి రెండు, మూడుసార్లు మాత్రమే నీళ్లు వచ్చాయని వాపోయారు. ప్రధాన కాల్వ ద్వారా నీళ్లు వచ్చినా ల్యాదెళ్ల వద్ద పైన రైతులు అడ్డగించడంతో తమదాకా రాలేదని, సాగు నీటి కోసం తీవ్ర కష్టాలు పడాల్సి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. వేలాది రూపాయల పెట్టుబడి పెట్టి రాత్రింబవళ్లు కష్టపడి పంటను కాపాడుకుంటూ వచ్చామని, ప్రస్తుతం పంటకు చివరి తడి పెట్టాల్సి ఉందన్నారు. కాల్వ నీళ్లు రాకపోవడంతో ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. నీళ్లిస్తామని, ఆరుతడి పంటలేయాలని చెప్పడంతో కౌలుకు తీసుకుని సాగు చేస్తే అప్పులే మిగిలాయని వాపోయారు. శాయంపేట ఎస్సారెస్పీ డీబీఎం-31 పరిధిలో ప్రస్తుతం చివరి తడి అందక 200 ఎకరాలు ఎండిపోతున్నాయని, అధికారులు వెంటనే నీళ్లు విడుదల చేసి పంటను కాపాడాలని కోరారు.



నీళ్లు లేక వెలవెలబోతున్న ఎస్సారెస్పీ డీబీఎం-31 ప్రధాన కాల్వ, ఉప కాల్వ

**ప్రభుత్వం ఆదుకోవాలి**



ఎస్సారెస్పీ నీళ్లు వస్తాయని రెండున్నర ఎకరాలు కౌలుకు తీసుకున్నా. ఎంతో ఆశతో వేలాది రూపాయలు పెట్టుబడి పెట్టి మక్కజొన్న పంట సాగు చేసిన. ప్రధాన కాల్వ నుంచి ఉపకాల్వకు నీళ్లు ఒకటి రెండు సార్లు వచ్చినయ్. రాత్రింబవళ్లు నీళ్ల కోసం భగీరథ ప్రయత్నం చేసినం. చివరి తడికి నీళ్లు లేక పంట ఎండిపోయింది. రూ.లక్ష వరకు పెట్టుబడి పెట్టి నష్టపోయా. ప్రభుత్వం ఆదుకోవాలి. వెంటనే పంటను కాపాడేందుకు చివరి తడికి కాల్వలకు నీటిని విడుదల చేయాలి.

*- నూకంటి మురళి, కౌలు రైతు, శాయంపేట*



**ఆరు ఎకరాలు ఎండిపోయింది**

నాకున్న ఎకరంతో పాటు మరో ఆరు ఎకరాలను కౌలుకు తీసుకొని మక్కజొన్న పంట వేశా. ఎస్సారెస్పీ ప్రధాన కాల్వ పక్కనే ఉండడంతో నీళ్లు వస్తాయని ఆశతో ఎకరం రూ.14వేల చొప్పున కౌలుకు తీసుకున్నాను. రెండుసార్లు మాత్రమే కాల్వలో నీళ్లు వచ్చినయి. నీళ్లివ్వాలని అధికారుల చుట్టూ తిరిగినా ఫలితం లేకపోయింది. ఆరు ఎకరాలు పూర్తిగా ఎండిపోయింది. కౌలుతో పాటు పెట్టుబడి రూ.2.50 లక్షలు నష్టపోయా. ప్రభుత్వమే ఆదుకోవాలి.

*- నీల రవీందర్, కౌలు రైతు, శాయంపేట*

**160 పైపులు వేసిన..**



నాలుగెకరాలు కౌలుకు తీసుకుని మక్కజొన్న పంట సాగు చేసిన. ఎస్సారెస్పీ కాల్వలో రెండు, మూడు సార్లు మాత్రమే నీళ్లు వచ్చినయి. అవి కూడా ఉపకాల్వలో చివరికి మాకు అందలేదు. పంటను కాపాడుకునేందుకు కిలోమీటర్ దూరంలోని దేవుని చెరువు నుంచి 160 పైపులు వేసి దగ్గరలోని ఒక గుంతలో నీళ్లు పోయించుకొన్న. అక్కడి నుంచి మరో మోటరుతో వారం రోజులు రెండు మోటర్లు పెట్టి మక్కజొన్న చేనుకు పారించుకున్నా. వేలాది రూపాయలు ఖర్చు చేసినా చివరి తడికి నీరు లేక పంట ఎండిపోతోంది. మరో నాలుగెకరాల్లో వరి పంట కూడా కౌలుకు తీసుకుని సాగు చేశా. అది కూడా ఎండిపోయింది. మొత్తం రూ.3లక్షల వరకు నష్టం జరిగింది. వెంటనే చివరి తడికి నీళ్లు అందించి నష్టపరిహారం చెల్లించాలి.

*- బెరుగు సతీశ్, కౌలు రైతు, శాయంపేట*



ఎండిన మక్కజొన్న పంటను చూపుతున్న బాధిత రైతులు